క్లుప్తంగా

ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు 'తేజ' విద్యార్థులకు ఆహ్వానం

కోదాడ: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 15న స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనాలని కోదాడ పట్టణంలోని తేజ విద్యాలయానికి చెందిన 15మంది విద్యార్థులకు ఆహ్వానం అందింది. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా నిర్వహించిన క్విజ్‌లో విజేతలుగా నిలిచిన తేజ విద్యాలయానికి చెందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ఉస్సేల రమా సోమిరెడ్డి మంగళవారం తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 31వ తేదీ వరకు నిర్వహించిన ఈ క్విజ్‌లో దేశ వ్యాప్తంగా 200 మందిని ఎంపిక చేశారని, అందులో తేజ విద్యాలయానికి చెందిన 15 మంది విద్యార్థులు ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మోతె: వర్షాల దృష్ట్యా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల అభివృద్ధి అధికారి ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. చెరువుల, వాగుల్లో చేపల వేటకు వెళ్లొద్దని తెలిపారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేసి పోలీసు సేవలు పొందాలని తెలిపారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండొద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని తెలిపారు. వర్షం పడే సమయంలో చెట్ల కింద ఉండొద్దని కోరారు.

ప్రభుత్వ పాఠశాలకు నేమ్ బోర్డు బహూకరణ



పాఠశాల నేమ్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గోపాలరావు

మోతె: మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలకు ఆ గ్రామానికి చెందిన జూలకంటి జాన్సిరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు జూలకంటి కరుణాకర్‌రెడ్డి పాఠశాల నేమ్ బోర్డును మంగళవారం బహూకరించారు. ఈ ఈ సందర్భంగా నేమ్ బోర్డును మండల విద్యాధికారి కె.గోపాలరావు ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం దాత జూలకంటి కరుణాకర్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.లక్ష్మీకాంతమ్మ, లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

12 మంది డీజే యజమానుల బైండోవర్

మునగాల: మునగాల మండల పరిధిలో డీజే యజమానులకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ రామకృష్ణారెడ్డి అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో వినాయకచవితి, నవరాత్రి ఉత్సవాలు, పండుగలు, వివాహాల సమయాల్లో డీజేలు పెట్టరాదని ఆయన హెచ్చరించారు. డీజేల వలన కలిగే అనర్థాలను వారికి వివరించారు. అనంతరం 12 మంది డీజే యజమానులను ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి రూ.5లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేశారు. మండల వ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించి డీజేలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని, ఒకవేళ ఎవరైనా డీజేలు పెడితే వారికి సహకరించొద్దని సీఐ కోరారు.

నిరుద్యోగుల అరెస్టు హేయమైన చర్య

పాలకవీడు: ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పాలకవీడు మండలం నుంచి బయలుదేరిన నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు పెరుమాళ్ల సతీష్ మాట్లాడుతూ నిరుద్యోగులను ముందస్తు అరెస్టు చేయడం హేయమైన చర్య అని అన్నారు. కార్యక్రమంలో కొండ సురేష్, అన్వేష్, జ్యోతిబసు తదితరులున్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్: జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని చలో గాంధీ భవన్ కార్యక్రమానికి వెళ్తున్న నిరుద్యోగులను మంగళవారం హుజూర్‌నగర్‌లో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలిపెట్టారు. అరెస్టయిన వారిలో నరేష్, సాయి, శ్రీకాంత్, శివ, వినోద్ నరసింహ, తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

మునగాల: ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బి.ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో అక్రమ వ్యాపారాలు, ఇసుక అక్రమ రవాణా, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్టం ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఎస్ఐ హెచ్చరించారు.

బీటీ రోడ్డుగా మారేదెప్పుడో..

- అధ్వానంగా అవిరేణికుంటతండా–పెదవీడు రోడ్డు
- వానొస్తే బురదమయం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



అధ్వానంగా పెదవీడు నుంచి అవిరేణికుంటతండా వెళ్లే మట్టిరోడ్డు



అవిరేణికుంటతండా వద్ద రోడ్డుపై బురదలో నాట్లు వేస్తున్న గిరిజనులు (ఫైల్)

మఠంపల్లి: మండలంలోని పెదవీడు నుంచి అవిరేణికుంటతండా వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు 2 కి.మీ ఉన్న ఈ మట్టి రోడ్డు చిన్నపాటి వాన కురిసినా చిత్తడిగా మారుతోంది. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. వర్షాకాలంలో అవిరేణికుంటతండా సమీపంలో రోడ్డుపై గుంతలు ఏర్పడి వాననీరు నిలిచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అయితే ఏడేళ్లక్రితం వరకు అవిరేణికుంటతండా పెదవీడు గ్రామ పంచాయతీకి ఆవాస ప్రాంతంగా ఉండేది. ఆ తర్వాత ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. కానీ ఈ గ్రామానికి వెళ్లే రోడ్డును బీటీగా మార్చడంపై మాత్రం ప్రభుత్వాలు, పాలకులు దృష్టి పెట్టడం లేదు. పెదవీడు మేజర్ గ్రామపంచాయతీ కావడంతో అక్కడ బ్యాంకు, పశువైద్యశాల, పోస్టాఫీస్, వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఉన్నాయి. దీంతో అవిరేణికుంటతండావాసులు నిత్యం పెదవీడుకు వచ్చిపోతుంటారు. అదేవిధంగా పెదవీడు ప్రజలు అవిరేణికుంటతండా మీదుగా అల్లీపురం, అమరవరం, కొత్తతండా, భీల్యానాయక్ తండా, దొనబండతండా, యాతవాకిళ్ల గ్రామాలకు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారు. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నారు. కావున సంబంధిత అధికారులు దృష్టి సారించి అవిరేణికుంటతండా – పెదవీడు మధ్య గల మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి తమ ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డుగా మార్చాలి



అవిరేణికుంటతండా నుంచి పెదవీడు వెళ్లే మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు ప్రమాదాలకు గురై గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలి.

– బానోతు నాగేశ్వరనాయక్, అవిరేణికుంటతండా


రాకపోకలకు ఇబ్బందులు



పెదవీడు నుంచి అవిరేణికుంటతండా వెళ్లే రోడ్డు గతంలో డొంకదారిగా ఉండేది. దానిని కొన్ని ఏళ్ల క్రితం మట్టి రోడ్డుగా మార్చి వదిలేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉంటోంది. నిధులు మంజూరు చేసి బీటీ రోడ్డు వేయాలి.

– గుంగంటి లక్ష్మీనారాయణగౌడ్, పెదవీడు

పులిచింతల 8 గేట్ల ద్వారా నీటి విడుదల



పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని కృష్ణానదిపై ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో 8 గేట్లను మూడు మీటర్ల మేర ఎత్తి 2,79,690 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు 1,94,687 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. మంగళవారం రాత్రి వరకు ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో తెలంగాణ వైపు ఉన్న విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు పేర్కొన్నారు.

నిబంధనల మేరకు పరిహారం చెల్లిస్తాం

- హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్: వ్యవసాయ కళాశాల కోసం సేకరించే భూమికి ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం చెల్లిస్తామని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం హుజూర్‌నగర్ శివారులోని సర్వే నంబర్ 1041లో ఉన్న భూమిని సాగు చేసుకుంటున్న రైతులతో స్థానిక టౌన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు సర్వే నంబర్ 1041లో ఉన్న దాదాపు 200 ఎకరాల భూమి అన్ని రకాలుగా అనువుగా ఉందని సర్వే చేసిన ఉన్నతాధికారులు రిపోర్టులో పేర్కొన్నారని చెప్పారు. త్వరలో ఆ సర్వే నంబర్‌లో ఉన్న భూమిని క్షేత్రస్థాయి సర్వే చేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జునరెడ్డి, సర్వేయర్ వంశీ, నాయకులు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, యరగాని నాగన్నగౌడ్, తన్నీరు మల్లికార్జున్, గల్లా వెంకటేశ్వర్లు, వెల్లంద వీరారెడ్డి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ 23.64 లక్షల నష్టపరిహారం..

చింతలపాలెం మండలంలోని బుగ్గమాదారం వద్ద నిర్మించే రాజీవ్‌గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం సేకరించనున్న భూమికి ప్రభుత్వం ఎకరాకు రూ 23.64 లక్షల నష్టపరిహారం చెల్లిస్తుందని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ లిఫ్ట్ కింద భూమి కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఏత కానుగు శ్రీనివాస్, డీటీ శ్రీనివాసరావు, లిఫ్ట్ చైర్మన్ డీటీ రామయ్య, వైస్ చైర్మన్ రేపాల వెంకట్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు నరాల కొండారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



మునగాల: కొక్కిరేణిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్: మండలంలోని శ్రీనివాసపురంలో సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి జయంతిని మంగళవారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.హుస్సేన్, నాయకులు తంగెళ్ల వెంకటచంద్ర, మాదురి నరసింహచారి, టి.గోపిరాజు, శేఖర్, కృష్ణారావు, పి.శ్రీనివాస్, బి.వెంకటేశ్వర్లు, అంజయ్య, గోపాలరావు, అన్నపూర్ణ, మల్లేశ్వరి, గిరి, దుర్గమ్మ పాల్గొన్నారు.

కొక్కిరేణిలో..

మునగాల: మండలంలోని కొక్కిరేణిలో సీపీఎం అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి జయంతిని మంగళవారం సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామశాఖ కార్యదర్శి నందిగామ సైదులు, పార్టీ సభ్యులు రావులపెంట బ్రహ్మం, నిడిగొండ శంభయ్య, వట్టెపు చిన్నసైదులు, మామిడి గురుమూర్తి, రావులపెంట శేషగిరి, మిట్టగణుపుల సైదులు, అంజయ్య పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మఠంపల్లి: బక్కమంతులగూడెంలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

మఠంపల్లి: ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మండల పీఏసీఎస్ వైస్ చైర్మన్ బానోతు బాబునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని భీల్యానాయక్‌తండాలో లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బానోతు రామునాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బక్కమంతులగూడెంలో..

మండలంలోని బక్కమంతులగూడెంలో లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సోమిరెడ్డి గోవిందరెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు గంగసాని ఎల్లారెడ్డిలు మంగళవారం రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరారెడ్డి, చినరాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట పొలాల్లోకి మురుగు నీరు

- ఆక్రమణలో మురుగు కాలువ
- సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల వేడుకోలు



మురుగు నీటితో మునిగిన పంట పొలం

చిలుకూరు: మండలంలోని జానకినగర్‌లో డ్రైనేజీ సమస్య మంగళవారం మళ్లీ తెరపైకి వచ్చింది. గ్రామంలో డ్రైనేజీ నీరు పారకుండా కొందరు కాలువను ఆక్రమిస్తూ వేయడంతో గత కొన్నిరోజులుగా ప్రధాన రహదారిపై మురుగు పారి గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. దీంతో అధికారులు స్పందించి గ్రామంలోని దేవాలయం ఎదురుగా పాలవక్క నుంచి కోదాడ వైపుకు కాలువ తీయించి ముదిగుడేనికి వెళ్లేలా చర్యలు చేపట్టారు. కాని అటు వైపు కాలువ తీయడంతో మురుగునీరు తమ పొలాల్లోకి వచ్చి చేరుతోందని, పొలాలు మొత్తం మునిగిపోయాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న డ్రైనేజీ ఆక్రమణను తొలగించి మురుగునీరు వెళ్లేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని వారు ఎంపీఓ ముక్కపాటి నరసింహారావుకు తెలియజేయడంతో ఆయన అక్కడకు వచ్చి పరిశీలించారు. గతంలో ఉన్న డ్రైనేజీ ఆక్రమణ తొలగించి మురుగునీరు పారేలా చేసి సమస్యను పరిష్కరించాలని కార్యదర్శికి సూచించారు.

రైతులకు యూరియా కొరత రానివ్వొద్దు



మునగాల పీఏసీఎస్‌లో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న డీసీఓ పద్మ

మునగాల: కోఆపరేటివ్ సొసైటీలో రైతాంగానికి యూరియా కొరత లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్.పద్మ సూచించారు. మంగళవారం మునగాల మండలంలోని తాడువాయి, మునగాల పీఏసీఎస్‌లలోగల ఎరువుల గోడౌములను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీఏసీఎస్ గోడౌములలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. తాడువాయి సొసైటీలో అవినీతి అక్రమాలకు పాల్పడిన సిబ్బంది, కార్యదర్శి, స్టాఫ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్‌పై శాఖాపరమైన విచారణ పూర్తయిందని, త్వరలో వారి నుంచి రికవరీకి ఆదేశాలు జారీచేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునగాల, తాడువాయి సొసైటీల కార్యదర్శులు బసవయ్య, ప్రదీప్‌రెడ్డి, సిబ్బంది, మండల వ్యవసాయాధికారి బుంగ రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ

హుజూర్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ జాయింట్ సెక్రటరీ అజీజ్‌పాషా, మాజీ కౌన్సిలర్ అట్లూరి హరిబాబు మంజుల అన్నారు. మంగళవారం పట్టణంలోని 19 వార్డులో వారు మొక్కలు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ నాగేశ్వరరావు, ఆర్‌పీ విజయలక్ష్మి, నాయకులు సుబ్బరాజు, శిరీష, బాలమ్మ, పుష్ప, వేణి, సీత, పున్నమ్మ, నాగమణి, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

నేరేడుచర్ల: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడంతో పాటు సెల్ఫీదిగాలని తిరంగా ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి, మండల అధ్యక్షుడు చింతకుంట్ల రాజేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం నేరేడుచర్ల మండల కేంద్రంలో జరిగిన బీజేపీ ఉమ్మడి నేరేడుచర్ల మండలాల సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాల్లో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ కార్యదర్శులు ఏమిరెడ్డి శంకర్‌రెడ్డి, కాలం నాగయ్య, తాళ్ల నరేందర్‌రెడ్డి, సంకులమద్ది సత్యనారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, జగతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బక్కిరెడ్డి, రామ్మూర్తి, విమల, వినయ్, శ్రీను, పవన్, నాగరాజు, సైదులు, నాగయ్య తదితరులు ఉన్నారు.

స్వాతంత్య్ర ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్‌ది ప్రధాన పాత్ర

నేరేడుచర్ల: స్వాతంత్య్ర ఉద్యమంలో ప్రధాన భూమికను పోషించిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ మాత్రమేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నేరేడుచర్లలోని స్పందన జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీను, వెంకట్, భరత్, సతీష్, తులసి, ఆభ్యాస్, సాయి, రమ్య, సందీప్, యశ్విత, రూప, మైథిలి, తేజశ్రీ తదితరులు ఉన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్: మండలంలోని బూరుగడ్డ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దివ్య క్షేత్రంలో క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి మంగళవారం 108 తమలపాకులతో ఆకుపూజ చేశారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం చేసి గంధ సిందూరం, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పుళిహోర, వడమాల, ప్రసాద నివేదన గావించారు. నిర్వాహకులు వై.లక్ష్మీనర్సయ్య, నాగమణి దంపతులు, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ ఈఓ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు రావాలని మంత్రి ఉత్తమ్‌కు ఆహ్వానం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో ముత్యాలమ్మ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో ఈ నెల 17, 18, 22 తేదీల్లో నిర్వహించబోయే ముత్యాలమ్మ జాతరకు రావాలని కోరుతూ జాతర నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతరకు తప్పక వస్తానని, ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దొంతగాని ప్రసాద్, కంచర్ల అరవింద్‌రెడ్డి, వేముల నర్సయ్య, బెల్లంకొండ అమర్, పశ్య శ్రీనివాసరెడ్డి, రామిశెట్టి రాము, పేరం నర్సింహ, చింతకాయల శేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళగౌరి వ్రతం



మంగళగౌరి వ్రతంలో పాల్గొన్న మహిళలు

నేరేడుచర్ల: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో మంగళవారం మంగళగౌరి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు బ్రుందావనం శేషు అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మంగళగౌరి వ్రతం జరిపారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త రాచకొండ విజయ్ సహకారంతో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, పూజారుల వెంకటరమణారావు, ఉప్పుల కృపాకర్, మాశెట్టి సైదయ్య, రాచకొండ శ్రీనివాస్‌రావు, కందిబండ శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, చింతకుట్ల శ్రీనివాస్‌రావు, పుల్లారెడ్డి, జంగారావు, విజయలక్ష్మి, శోభ, చంద్రకళ, మానిక పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ఐక్యంగా పోరాడాలి



హుజూర్‌నగర్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్: బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఒంటరిగా కాకుండా అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ఐక్యంగా పోరాడాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటరెడ్డి కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వానికి బీసీలపట్ల చిత్తశుద్ధి లేదని, బీసీ బిల్లును అడ్డుకొని బీసీలకు తీవ్ర ద్రోహం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పి.హుస్సేన్, నాయకులు శీలం శ్రీను, టి.యోన, వీరమల్లు, వై.సోమ య్య, ఆర్.మురళి, లింగమ్మ, నాయకులు వీరబాబు, నరేష్, వెంకన్న, లక్ష్మమ్మ, వెంకటి, మల్లయ్య, పద్మజాలు, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే బీసీ రిజర్వేషన్లు సాధ్యం

మేళ్లచెరువు: పోరాటాలతోనే రిజర్వేషన్లు సాధ్యమవుతాయని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు పేర్కొన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ రాజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండు సైదులు, బత్తుల సైదులు, ఆదినారాయణ, నర్సింహారావు, శంకర్, నరేష్, శంభయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ భూసమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందజేస్తున్న సుమన్ మౌర్య

మునగాల: మండలంలో భూభారతి గ్రామ సభల్లో చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పెండింగ్ భూసమస్యలను పరిష్కరించాలని మండలానికి చెందిన బహుజన నాయకుడు, సామాజిక కార్యకర్త రాయరాల సుమన్ మౌర్య కోరారు. సోమవారం మునగాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను ఆయన కలిసి భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారానికి సామాజిక కార్యకర్తలుగా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ నాయకులు పచ్చిపాల రామకృష్ణయాదవ్, జనసేన మండల నాయకులు బాదె అంజి, బడేటి సాయిరామ్, కాలె కార్తిక్, చిర్రా వీరబాబు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అక్రమ అరెస్టు సరికాదు



చిలుకూరు: అరెస్టయిన బీజేపీ నాయకులు

మఠంపల్లి: హైదరాబాద్‌లో దుండగులు కూల్చివేసిన పెద్దమ్మతల్లి దేవాలయంలో పూజలు చేయడానికి బయలుదేరిన బీజేపీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గిరిజన మోర్చా జిల్లా నాయకుడు బానోతు రంగానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దమ్మతల్లి ఆలయాన్ని కూల్చివేయడం దుర్మార్గమన్నారు. దుండగులను శిక్షించాల్సిన ప్రభుత్వం పూజలు చేసేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు హుస్సేన్‌గౌడ్, సైదులు, వెంకటేష్‌నాయక్, జోను, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

చిలుకూరు: హైదరాబాద్‌లోని పెద్దమ్మ గుడి వద్దకు కుమ్మరుల నిర్మాణానికి హిందూ సంఘాల పిలుపునిచ్చిన నేపథ్యంలో బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడారు.. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో హిందువులకు స్వేచ్ఛ లేకుండా పోయిందని వాపోయారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల కార్యదర్శి కొండా శ్రీను, ఉపాధ్యక్షుడు వర్ణాపురం సతీష్, కొండా రాము, కొండా రాంబాబు, మేకపోతుల నవీన్ తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

మఠంపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి నిరసన తెలిపి మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలన్నారు. కార్మికులకు అందాల్సిన పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మికులకు ప్రతి నెల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పైదానాయక్, అంజయ్య, మాజీ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, మైసయ్య, నాయకులు శ్రీను, వినోద్, బాలకృష్ణ, నరేష్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

నేరేడుచర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు రామ్మూర్తి, విజేత, బాలు, రమేష్, నర్సింహారావు, ఆఫ్రా, ఎస్‌పీ వీరబాబు, శౌరి, జానకిరాములు, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, వెంకటరెడ్డి, జానయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు ఉన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

మేళ్లచెరువు: మండలంలోని జగ్గతండా గ్రామానికి చెందిన బానోతు శారద వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల విలువ గల చెక్కును మంగళవారం పలువురు నాయకులు అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు సుదాకర్‌నాయక్, నాయకులు భూక్యా జయరాం నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు చెందిన పి.సోమయ్యకు మంజూరైన రూ.37,500 సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం పట్టణంలో మంత్రి ఉత్తమ్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుకు అందజేశారు. నాయకులు ఎండీ అజీజ్ పాషా, ఎస్.సుబ్బరాజు, జె.మల్లయ్య, బి.గోవిందరావు, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.